నిశీథినీ శంఖారావం

శ్రీ "కాంకలూరి"

గూడ్సుబండి గునుస్తూ నడుస్తోంది.

లోకంచుట్టూ చీకటి నగ్నంగా నృత్యం చేస్తోంది. ఆకాశంలో చుక్కలు ప్రపంచాన్ని క్రమ్మిన అంధకారాన్ని చూచి, గొంతెత్తి అరుస్తున్నాయి. ఆ అరుపులు అర్థంలేని ధ్వనుల్ని నింపు కొని అనంతంలో మిళితమైపోతున్నాయి.

గూడ్సుబండి కునుకుతూ కూత వేసింది.

దూరంగా పర్వతం లోయల్లో కొండరాళ్లను దాటుకుంటూ ప్రవహించే సెలయేళ్ళ ఏడుపు, చిన్నగా, మరీచిన్నగా అవ్యక్తంగా వినవస్తోంది. ఎందుకో నక్కలు, ఒక్కసారిగా ఎక్కడో అరుపులు మొదలుపెట్టాయి. గుడ్లగూబలు కేకలుపెట్టాయి. కీచురాళ్ళ మర్మర రవం వినవస్తోంది. ప్రశాంత వాతావరణంలో ప్రకృతి వ్యతిరేకమైన ప్రతిపని ధ్వనీ వినవస్తోంది. ఒక్క నిమిషం నిశ్శబ్దం. పూర్తి నిశ్శబ్దం. భరింపరాని నిశ్శబ్దం. భయంకరమైన నిశ్శబ్దం. ప్రళయమైన నిశ్శబ్దం. ఇంతలో ప్రాణంమీదికి ముంచుకొచ్చినట్లు, ప్రపంచంపైన ప్రళయకాల మహాపయోధి వచ్చి పడుతున్నట్లు, గొంతువూపిరి ఆడకపోయినా, శక్తినంతా ఉపయోగించి, ప్రయత్నించి, చస్తున్న రాక్షసికంటే భయంకరంగా, నిశ్శబ్దానికి భంగకరంగా గోండ్రుపెట్టి అరచింది గూడ్సు బండి.

గూడ్సుబండి కొండ ఎక్కుతోంది.

చుట్టూ దట్టంగా పెరిగిన చెట్లనుదాటుకుంటూ సాగిన రైలు రోడ్డుమీద గూడ్సుబండి పైకి పాములాగా మెలికలు తిరుగుతూ ప్రాకుతోంది.

గూడ్సుబండి ఇంజనులో డ్రైవరు గురవయ్య ప్రూతంగా కనిపిస్తున్నాడు.

ఇంజను పొయ్యిలోంచి, విచిత్రంగా, అపూర్వంగా కంపు వచ్చి, నాసికా రంధ్రాల్ని పగలగొడుతోంది.

గురవయ్యకు ముక్కు మూసుకోవాలని తెలియని పరిస్థితి. డ్రైవరు ప్రక్కనన్న ఫైర్‌మన్ రెండుచేతులతో ప్రయత్నించి ముక్కు మూసు కున్నాడు.

గురవయ్య వంటినిండా చెమట పట్టింది. బట్టలు ముద్దముద్దగా తడిసిపోయాయి. ఆ చెమట బట్టలపైన బొగ్గు నుసి కొట్టుక అద్దినట్లు వుంది. బట్టలు మరీ నల్లగా కనిపిస్తున్నాయి. ఆ బట్టలు పడిన నీడగానీ, నెత్తురుగానీ గుర్తురానంత నల్లగావున్నాయి.

గురవయ్య పిడికిలి ముడుచుకొని వుంది. పళ్ళు నోటిలో ఒక ఒకదానినొకటి నొక్కి పట్టుకున్నాయి. నొసటి మీద చిక్కు చిక్కుగా ముడతలు పడివున్నాయి. నొసటిమీద చెమటబిందువులు తళతళ లాడుతున్నాయి. ముఖంలో వెలుగునీడలు వ్యాపిస్తున్నాయి. గురవయ్యముఖంమీద సాలెగూడులాగా వెలుతురు, మండుతున్న పొయ్యిమూత కన్నాలలోంచి వచ్చి పడు తోంది. ముక్కుపైగా చెమటబిందువులు జారుతున్నాయి. కను రెప్పలు చెమటతో తడిసిపోయాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు మందంగా సాగుతున్నాయి. ముక్కుపుటాలు కంపిస్తున్నాయి. కఠినమైన అధరాలు వణుకుతున్నాయి. ముఖంలోని ప్రతి నంట్రుక కూడు కంపరమెత్తిపోతోంది.

గూడ్సు బండి కొండ ఎక్కింది.

గురకపెడుతూ గాలి తోలింది.

గాలి విసురికి ఇంజనుపొయ్యి చలించింది. పొయ్యిలోంచి ప్రకృతికి వళ్ళు తెలియకపోతే పుట్టినగాలి బైటకివచ్చింది. ఆ గాలి చస్తూ బ్రతుకుతూ వాసన మోసితెచ్చింది.

కంపు! ముక్కులో రక్తనాళాలు పగిలిపోయే కంపు. స్మశానంలో మనిషిని కాలుస్తుంటే వచ్చేకంపు.

గురవయ్యకు ముక్కుమూసుకోవాలని తట్టలేదు. ముక్కు ముక్కుమూసుకున్న ఫైర్‌మన్ గూడ్సుబండి నడుపుతున్నాడు. ఎర్రని గాజుగోళీల్లాంటి రక్తం గడ్డకట్టినకళ్ళలోంచి చూపులు నిర్వ్యాపారంగా మండుతున్న పొయ్యిపై పునూటిగా విసిరాడు.

గురవయ్య ఆలోచనలులాగా పొయ్యిలో సుడులుతిరుగు తున్నాయి పొగలు. ఆ పొగల్లో అంతకు ముందు జరిగిపోయిన విషయం గుర్తుకొచ్చింది. పొయ్యిలోంచి వచ్చే వాసనకు, అంతకు ముందు జరిగిన సంఘటనకు సంబంధం అతని ముఖంలో తేలుతోంది.

అంతకు కొంచెం ముందు.........

గూడ్సుబండి కొండకు రెండు మైళ్ళదూరంలో దట్టమైన అడవిలోంచి నడచింది.

అప్పుడు........................

భూమిమీద చీకటి పెత్తనం ముమ్మరంగా చెలాయిస్తోంది. మిణుగురుపురుగులు వెలుగునిద్దామని ప్రయత్నించి, ఏడ్చి, కిక్కురు మనకుండ వూరుకున్నాయి. చీకటి సింగారించుకొని చిత్రంగా నవ్వి నగ్నంగా, భీకరంగా, నర్తిస్తూ వర్తించింది.

అంతలో.........................

గుబురుగావున్న కొండ దగ్గర అడవిలో చెట్ల మధ్యగా ఓక అరుపు వినవచ్చింది. మార్రోతలు వినిపించాయి. దశదిశలూ ప్రతిధ్వనించాయి. సాధారణమయిన నక్క అరుపు కాదు. వడుం విరిగిన ఏనుగుఘీంకారం కాదు. కాలంమూడిన కుక్క అరుపు కాదు. చిక్కిపోయిన సింహగర్జన కాదు. చీకట్లో పిస్తతో

తలొంచుకుపోయే రైలింజనుహోరహోరా కాదు. అన్నిటికీ అతీతం. అర్థంగాని ధ్వని. ఊహించలేని శబ్దం.

—మనిషి చావబోయేముందు చివరిసారిగా, ఉన్నతమైన స్వరంతో పెట్టే గావుకేక.

అనుకున్నట్లు గూడ్సుబండి మెల్లగా నడిపాడు గురవయ్య. గూడ్సుబండి వెలుగులో రైలురోడ్డు ప్రక్కగా ఫర్లాంగుదూరంలో ఎవరో ఏదో ఎత్తుకొని నిలబడ్డాడు. గురవయ్య అందుకున్నాడు. ఇంజను ప్రక్కగా మూడో మెట్టుమీదికి దిగి.

క్రింద నిలబడినవాడు అందించిన బరువు అందుకున్న గురువయ్య వెంటనే ఇంజనుపొయ్యి మూతతీసి, దాంట్లో పెట్టి, బొగ్గువేసి, మూతవేశాడు. బట్టలమీద రక్తం పడింది. ముఖంలో అత్రుతపోయింది. శరీరానికి చెమట పట్టటం మొదలు పెట్టింది. అప్పుడు తను బైటికిచూశాడు. అందించిన బాబు గూడ్సు గార్డుపెట్టె దాటకముందే కనిపించకుండా అడవిలోకి వెళ్లి పోయాడు. బాబు వెళిపోవటం తను చూడలేదు.

గూడ్సుబండి కొండదాటి లోయలోకి దిగుతోంది.

భోరున గాలి తోలింది. కంపు! సహించరాని కంపు, కండలు కాలిన కంపు. నరాలు మాడిన కంపు. వెంట్రుకలు పొటమరించే కంపు.

పొగలు పొరలుతున్న పొయ్యిమూత తీశాడు గురవయ్య. లోపల శవం కాలిపోతోంది. పూర్తిగా కాలిపోలేదు. గుర్తుపట్టటానికి మాత్రం వీలులేదు. ఊచల్లాంటి చేతులు, కట్టెల్లాంటి కాళ్లు, ముడుచుకొనిపోయిన దుంగలాంటి శరీరం. రాయిలాంటి తల పగిలిపోయింది. అన్నీ మండుతూనే వున్నాయి. ఉమ్మివేశాడు తుపుక్కున గురవయ్య.

బొగ్గువైపు చూశాడు. పొయ్యివైపు చూశాడు. బొగ్గు పొయ్యిలో వేశాడు. శవం ఛాయలు కనిపించకుండ చేశాడు. బొగ్గు పూర్తిగా పొయ్యిని క్రమ్మింది. పొగలు దట్టంగా వస్తున్నాయి మూత వేశాడు గురవయ్య.

డ్రైవరు దూరంగా నిలబడ్డాడు. ఫైర్‌మెన్ ఇంజను నడుపుతున్నాడు. గురవయ్య చెమట మెల్లగా చల్లారుతోంది. బట్టలు బొగ్గులో, రక్తంలో, చెమటలో తడిసి నల్లగా తయారయ్యాయి. ముఖం చిత్రంగా మార్పులు పొందుతోంది. పైపంటిక్రింద క్రింద పెదిమ నొక్కబడింది. కళ్ళు చిన్నవయ్యాయి. ముఖం ముంచిముడుచుకుపోయింది.

గూడ్సుబండి లోయలో పోతోంది.

ఇంజను పొయిలోంచి పొగలు సుడులు సుడులుగా కంపు కంపుగా వస్తున్నాయి.

కంపుకీ—ఇంజను పొయిలోంచి రావటానికి కారణాలు అతని ఆలోచనల్లో కదలాడుతూవున్నాయి.

విధవ మాడిపోతున్నాడు, అనుకున్నాడు గురవయ్య. మళ్లీ అనుకున్నాడు, తప్పుడు బుద్ధులున్న వాళ్ళు బ్రతక్కూడదు.

బాబు మంచివాడు. తనమాట విన్నాడు. తను చేయమన్న పని చేశాడు. వాడు తనని ఎప్పుడూ కాదనలేదు. అసలు బాబు అచ్చంగా తన కొడుకు. తండ్రికి తగిన కొడుకు. అందరిలాంటివాడు కాదు.

పొయ్యివైపు చూశాడు.

కాలుతున్నాడు విధవ. అసలు వాడెవడో తనకు తెలియదు. పెళ్ళాం తన తరఫు చుట్టమని చెప్పింది. తన పెళ్ళాన్ని వాడు అక్కా అని పిలిచేవాడు.

వాడు—కోటిగాడు—తన కింత ద్రోహం చేస్తాడని తను అనుకోలేదు. ఏదో లేనివాడు కదా అని తను వాడికి స్టేషనులో కూలీ మోసుకునేందుకు లైసెన్సు ఇప్పించాడు. వాడు ఇంత ద్రోహం చేస్తాడా?

వాడు వచ్చి సరిగ్గా సంవత్సరం కూడా కాలేదు. ఇంతలో ఎంతపని చేశాడు. ఎంత ద్రోహం. ఇంతగా ప్రవర్తిస్తాడని తెలిస్తే తాను వాణ్ణి చేరనిచ్చేవాడు కూడా కాదు.

వాడికి తను బుద్ధి బాగా చెప్పాడు.

బాబు లేకపోతే కోటిగాడికి తను శిక్ష వేయగలిగేవాడు కాదు. బాబు సహాయం చాలా వుంది. బాబుది ఆరోగ్యమైన శరీరం. కోటిగాడిది కూడా అంతే. ఇద్దరి వయస్సూ ఇరవై సంవత్సరాలకు మించదు. ఇద్దరి శరీరాలూ బొద్దుగానే వుంటాయి. ఇద్దరి ముఖ కవళికలు దగ్గర దగ్గరగా ఒకేలాగ వుంటాయి. జాగ్రత్తగా చూస్తే తప్ప పోల్చుకోలేము.

పాసింజరు ట్రెయిన్‌లో ఫైర్‌మన్‌గా పగలు డ్యూటీ చేసి వచ్చి పడుకున్నాడు బాబు. వాడి పక్కలోనే కోటిగాడు కూడా వున్నాడు. రాత్రి పదిగంటలకి తను డ్యూటీకి వస్తూ బాబుని లేపి చేయవలసిన కార్యక్రమమంతా చెప్పి, తను ఇంజనుదగ్గరకు వచ్చాడు. రాత్రి ఒంటిగంటకల్లా కార్యక్రమం నెరవేర్చాడు బాబు. వాణ్ణి చంపి ఇవ్వమని తను బాబుతో చెప్పాడు. అలాగే బాబు చేశాడు. తను ఆ విధవ కోటిగాణ్ణి ఇంజను పొయ్యిలో వేసి బూడిదచేసి చేశాడు.

పొయిలోంచి సన్నగా వాసన వస్తోంది.

కూడిపో! బోడి విధవా! ద్రోహంచేస్తావటరా అనుకున్నాడు తను. ఫైర్‌మన్ నడుపుతున్నాడు, ఇంజను.

గూడ్సుబండి కొండప్రాంతంలోనే నడుస్తోంది.

గురవయ్య పొయ్యివైపు చూశాడు.

కోటిగాడు తనకింత అన్యాయం తలపెడతాడని తెలిస్తే తను వాణ్ణి చేరనిచ్చేవాడు కాదు. ఎంత అప్రతిష్ఠ, ఎంత అపకీర్తి. తన గౌరవానికి హోదాకి మచ్చతెచ్చేపని చేస్తాడా వాడు. చావరా [illegible] అనుకున్నాడు గురవయ్య పొయ్యివైపు చూస్తూ.

—కృతజ్ఞత లేని ఒక విధవకి ఉద్యోగం చూపించటం తనది తప్పు. తనది బుద్ధిలేని పని. తను విధవ. వట్టి విధవ. [illegible] విధవ. వాడికి తను లైసెన్సు కూలీ ఉద్యోగం ఇప్పించాడు.

ఒకప్పుడు తనుకూడా లైసెన్సు కూలీయే. ఇప్పటికి పాతిక సంవత్సరాలనాడు తను లైసెన్సు కూలి. అప్పుడు తనకి పదిహేను సంవత్సరాలు. తనకి కూలీ మోయటానికి లైసెన్సు లేదుగాని తను కూలీ మోసేవాడు అప్పుడు.

తనకు తల్లిదండ్రు లెవరో తెలియనప్పుడు తను స్టేషనులో చేరాడు.

ఇంజను పొయ్యిలోంచి వాసన వస్తూనేవుంది.

ఫైర్‌మన్ బండి నడుపుతూనే వున్నాడు.

గూడ్సుబండి గునుస్తూ నడుస్తూవుంది.

గురవయ్య ఆలోచనలు సాగుతూవున్నాయి.

రైలుస్టేషనులో తన జీవితం పది సంవత్సరాలనాడు ప్రారంభమయింది. అంతకుముందు తానెవరో తనకు తెలియదు. లోకానికి అంతకంటే తెలియదు. కూలీ నాలీ మోసేవాడు. ప్రయాణీకులదగ్గర డబ్బు లడుక్కునేవాడు. ఎవరు ఏం పెట్టినా తీసుకునేవాడు. ఎక్కడో ఎత్తేసిన పుల్లాకుల్లో మెతుకులు తినేవాడు. ఏ ప్లాటుఫారంమీదనో, ఏ రైలుక్రిందనో, ఏ ఫెన్సింగుప్రక్కనో నిద్దర పోయేవాడు.

కూలీ మోసేటప్పుడు మాచిన లైసెన్సుకూలీల తిట్లుతిన్నాడు. తన్నులు భరాయించాడు. ప్లాటుఫారంమీద పోలీసుల అదమాయింపులకు తట్టుకున్నాడు. అనేక సందర్భాల్లో దొంగని అనుమానించి తన్నేటప్పుడు తమాయించుకున్నాడు. దున్నపోతులాగా వున్నాడనే దున్నపోతుల్లాంటి ప్రయాణీకుల బెదరింపులకు ఓర్చుకున్నాడు. ఘరానా మనుష్యుల చేతుల్లో కిక్కురు మనలేదు.

—నూరు సంవత్సరాల కష్టాలు తను చిన్నతనంలోనే అనుభవించాడు. కన్ను మూస్తూ తెరుస్తూ లోకంవైపు చూడకుండా జోగుతూ కాలంగడిపే తనకు కనువిప్పు కలిగించింది లోకం. దానితో ఎన్నడూ లేని క్రూరత్వం తనలోకూడా పీఠం వేసుకుంది.

ఒకసారి కూలీకి అడ్డంవచ్చిన ఒకణ్ణి పచ్చడి పచ్చడిగా చితగ్గొట్టాడు. ముఖం పగలగొట్టాడు. నడుం విరగదన్నాడు. రక్తం కళ్ళచూశాడు.

మరొకసారి తను ఏరుకునే పుల్లాకుల్లో మెతుకులు లాక్కోబోయిన మరొకణ్ణి చింతకాయ చట్నీ చేశాడు. పళ్ళురాలగొట్టాడు. దవడ పగలగొట్టాడు. కసి తీర్చుకున్నాడు.

తను పాయికాన దొడ్డిదగ్గర, లైటుకి దూరంగా, క్రీనీడన జీవితంలోని మురికిని పీల్చుకొంటూ, యాతన్ని విడుస్తూ నిద్రపోతుంటే తన ప్రక్క కందువా కొస్తా ఆ రాత్రి లాక్కుపోయిన వాడిని తెల్లారింతరవాత చావబాది కోపం చల్లార్చుకున్నాడు తను.

ప్రపంచం తనకప్పుడు అందించిన మహాప్రసాదం క్రూరత్వం. మూర్ఖంగా ప్రవర్తించటం, పరిస్థితులమీద బలంగా మరోతోవలో అడ్డదిడ్డంగా, ఆలోచన లేకుండా ఎదురొక్కునేట్టు చేయటం.

ఆ క్రూరత్వానికిది పరాకాష్ఠ. చచ్చిపోతున్నాడు విధవ. మూర్ఖంగా మూర్ఖత్వంమీద తిరగబడి నిల్వలేక [illegible] పోతున్నాడు.

వాడి ద్రోహం తలపెడితేనా ద్రోహి అనుకున్నాడు గురవయ్య. ఇంజను బాయ్లరు మండిపోతూనే వుంది.

కొంచెం కొంచెంగా వాసన ఇంజన్లో కొడుతోంది.

గూడ్సుబండి నడుపుతున్న ఫైర్‌మన్ తీగ లాగేసరికి ఇంజను కూతవేసింది. దూరంగా మునగదీసుకు పడుకున్న కొంప, నల్ల దుప్పట్లో నిశ్శబ్దంగా నిద్దరపోయే నిశిథి ఒక్కసారి ఉలిక్కిపడి లేచి ఆవులించి వూరుకున్నది.

కోటిగాడి కిప్పుడు ఇరవై సంవత్సరాలు. తనకప్పుడు పద హారు పదిహేడు సంవత్సరాలు వయస్సు. ఆ రోజు తను ఎవరి దగ్గరో కూలీ అందుకొని మోసుకొని పోతున్నాడు. అంతలో లైసెన్సు కూలీవచ్చి, కాలితో వీపుమీద తన్ని, నెత్తిబరువు మార్చుకొని, గుండెల్లో కొండలబరువు విడిచి, పోతూ పోతూ 'దున్నపోతు! పోయి బొగ్గు మోసుకోరాదు' లైసెన్సుకూలీ ధర్మబోధచేసి వెళ్లి పోయాడు.

ఒకనాడు మరొకడికీ తనకీ కూలిపంపకందగ్గర పేచివచ్చి తగాదాపడి తన్నుకుంటుంటే స్టేషనుగార్డు వచ్చి, వీపుచరిచి విడదీసి, నానా చివాట్లుపెట్టి, 'వెధవల్లారా! పనీపాటా లేకుండ తన్నుకోకపోతే పోయి బొగ్గు మోసుకోరదటంద్రా' అని వెళ్లిపోతున్న గార్డువెనుక తను పరుగెత్తి 'బాబ్బాబు ఎక్కడ బాబుబొగ్గు మోసేది' అని అడిగి తెలుసుకున్నాడు.

మరునాడు తెల్లవారకముందే మసక చీకట్లోనే, లోకో షెడ్డు దగ్గరకుపోయి, మేస్త్రీని కలుసుకొని, తను బొగ్గు మోస్తానని మనవి చేసుకున్నాడు. మేస్త్రీ తనవైపు దృష్టిసారించి తీక్షణంగా చూశాడు. తను కండలుబ్బించి నరాలు బిగబట్టి పట్లు పనిచేయగల దనే అభిప్రాయం కలిగేట్టు చేసే ప్రయత్నం కొనసాగిస్తూ వినయంగా నిలబడ్డాడు.

మేస్త్రీ ముఖంలో ఆనందం కనిపించింది. తను తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. మేస్త్రీ అడిగాడు 'బొగ్గు మోస్తావా' అని. తను మాట్లాడలేదు బుర్రమాత్రం, గట్టిగా, మాంఛి వూపుతో రెండు సార్లు అటూ ఇటూ వూపాడు.

గూడ్సుబండిలో నిలబడి గతం కళ్లఎదుటకు తెచ్చుకుని చూచుకుంటూ ఆలోచనల్లో లీనం అయిపోయిన గురవయ్య వీపుకి ఐరన్ రాడ్ ఒకటి గట్టిగా పొడుచుకుంది.

వెనక్కు తిరిగి చూశాడు గురవయ్య.

ఫైర్‌మన్ ఇంజను బాయ్లరులో బొగ్గు వేసి, బొగ్గుని కదిపిస్తున్నాడు. ఆ కదలికతో రాడ్ రెండోభాగం అనుకోకుండా గురవయ్యకు పొడుచుకుంది. ఆలోచనల గొలుసు తెగిపోయింది. కోపం వచ్చింది. ఫైర్‌మన్ డ్రైవర్ వైపు చూడకుండ కూడ పనిలో నిమగ్నుడై పోయాడు. గురవయ్యకోపం పోయింది. ఫైర్‌మన్ ఇంజనుబాయ్లరులో బొగ్గువేశాడు.

గురవయ్య ఆలోచనలు బొగ్గు వైపు మళ్లాయి.

తను లోకోషెడ్డులో బొగ్గుమోసేవాడు మొదట్లో, మేస్త్రీ సహాయంతో షెడ్డులో పనిలోచేరినప్పుడు. వాగన్లలోంచి దిగుమతైన బొగ్గు వేరొకచోట చేర్చటం మొదట్లో చేశాడు. తరవాత వాగన్లలోంచి బొగ్గుదించటం కొన్నాళ్లు చేశాడు. క్రిందవున్న బొగ్గుని ఇంజన్లో వేయటం మరికొన్నాళ్లు చేశాడు. ఇలా సంవత్సరం గడిచిపోయింది.

ఏదో అవసరమైన సందర్భంలో ఇంజను బాయ్లరులో బొగ్గు వేయవలసిందని మేస్త్రీ చెప్పి పంపించాడు. తను అలాగ్గా కొంత కాలం గూడ్సుబండిలో బాయ్లరులో బొగ్గు వేస్తూవుండేవాడు. మరి కొంత కాలానికి తనని ఫైర్‌మన్ అన్నారు. అప్పట్నుంచి తనకు వారం జీతంకాదు. నెలజీతం.

అప్పుడు తను ఫైర్‌మన్. అప్పట్లో తను ఫైర్‌మన్. అదే మొదలు తనలో తనుకూడా ఒకవ్యక్తి అని భావం రావటానికి. తనకు వ్యక్తిత్వంవుంది.

అంతకుముందు తను రిక్షావాళ్ళు తినే పీతిపాటల్లో నాలుగు మెతుకులు కతికేవాడు. ఓవర్ బ్రిడ్జిమీద ఎక్కడో నిద్రపోయే వాడు. అయితే పరిస్థితి తారుమారయింది. పగలు నిద్రపోవాలి. రాత్రి డ్యూటీకి పోవాలి. వేళగానివేళ అన్నంతినాలి. ఇదీ పరిస్థితి. ఇది విషమ పరిస్థితి తనకు. ఓవర్ బ్రిడ్జిమీద పగలు నిద్రపోవటం వచ్చినా కుదరదు. అనుకున్నప్పుడు అన్నం దొరకదు.

మేస్త్రీకి మగపిల్లలు లేరు. ఒక్కతే ఆడపిల్ల. తను మేస్త్రీని అడిగాడు పరిస్థితి వివరించి చెప్పి. మేస్త్రీ తెలుసుకున్నాడు. ముద్దుగా పిలుస్తూ 'నా యింట్లో వుండు బాబు' అన్నాడు. మేస్త్రీ భార్య ఒప్పుకుంది. తను మేస్త్రీ ననుసరించాడు.

సాగిపోతున్న గూడ్సుబండి బాయ్లరులో వాసనలేదు. గురవయ్య బాయ్లరువైపు చూశాడు.

బాయ్లరువైపుచూస్తూ వీడికి—కోటిగాడికి తను ఆశ్రయం ఇచ్చాడు. వీడు తన యింటికి వచ్చి సంవత్సరం కావస్తోంది. తను మేస్త్రీ ఇంట్లోచేరి ఇరవై సంవత్సరాలపైగా అవుతుంది.

వీడూ మేస్త్రీ దూరంచుట్టం. లైసెన్సుకూలీగా స్టేషనులో చేరాడు. ఉండటానికి ఇల్లు లేకపోవటంతో తన యింట్లో చేరాడు. తను చేరనిచ్చాడు. ద్రోహి అని తెలియదు. తెలిస్తే చేరనిచ్చేవాడు కాదు.

తనకిప్పుడు నలభైసంవత్సరాలకు పైచిలుకే వుంటుంది వయస్సు. ఇప్పుడు తనకొక కొడుకు, కూతురూ వున్నారు. కోటిగాడికి ఇరవై సంవత్సరాలు. బాబుకి ఇరవై సంవత్సరాలు. కూతురికి పద్దెనిమిది సంవత్సరాలు. తను మేస్త్రీఇంటిలో చేరినప్పుడు మేస్త్రీ కూతురికి పద్దెనిమిది సంవత్సరాలు.

గూడ్సుబండి ఇంజను తెంపులేకుండా కూతలు వేస్తోంది.

గురవయ్య ఆలోచనలకు అంతరాయం కలిగింది.

ఫైర్‌మన్ లైటుకి చూస్తూ తీగలాగుతూ వున్నాడు. గురవయ్య లైటుకి చూశాడు. దూరంగా కొంచెం ఎత్తులో ఎర్రలైటు కనిపిస్తోంది. సిగ్నలు ఇవ్వలేదు. మరి రెండుసార్లు తీగలాగాడు ఫైర్‌మన్. దూరంగావున్న ఎర్రలైటు పచ్చలైటుగా మారింది. సిగ్నలు వంగిపోయింది.

కూతలుకూని గూడ్సుబండి, సిగ్నలు దాటి స్టేషనులోకి వచ్చింది. స్టేషను చాలాచిన్నది. ఆగలేదు. దాటిపోయింది.

గురవయ్య గతం జ్ఞాపకాల సినిమా రీలు వర్తమానంలో గుర్తుకు తెచ్చుకొని చూచి ఎదురుగావున్న పొయ్యిలో తగలేస్తున్నాడు.

అప్పుడు తనని మేస్త్రీ భార్య 'బాబూ లేరా' అని లేపేది. స్నానం చేయించేది. బట్టలు ధరింపించేది. అన్నం పెట్టేది. డ్యూటీకి పంపేది. తను డ్యూటీకి పోయేవాడు. తను ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడుకాదు. కాదు—తను అసలు మాట్లాడే వాడేకాదు. ఎవరిఎదుటా నిలబడేవాడు కాదు. అసలు అవసరం కలగలేదుకాదు. పిలిస్తే తలవంచుకొనే పలికేవాడు. ఏమైనా అడిగితే తలవంచుకునే సమాధానం చెప్పేవాడు.

పిల్లి కూడా తనభార్య గౌరవంగా చూచేది. ఏలోటూ రానీకుండా చేసేది. వాడు ఎప్పుడు ఎక్కడ వుండేవాడో ఎవరికీ తెలియదు. ఒకరోజు స్టేషనులో పడుకునేవాడు. మరొకరోజు ఇంట్లో పడుకునేవాడు. వాడు ఎప్పుడు కూలీమానేవాడో తెలియదు. డబ్బుమాత్రం ఏదో ఇంత తనభార్యకు వాడు ఇస్తూ వుండేవాడు.

అప్పుడు తనకు ఇరవై సంవత్సరాలు నిండాయి. ఆ ప్రాంతంలోనే క్రొత్తగా గూడ్సుబండి వేశారు. డ్రైవర్సుస్టేట్ తగ్గింది. ముగ్గురు డ్రైవర్లు అవసరమయ్యారు. సర్వీసున్న ఫైర్ మన్లను డ్రైవర్లుగా ప్రమోట్ చేసే ఏర్పాటు జరిగింది. తనకు ప్రమోషన్ వచ్చింది. అంతే మళ్ళీ ప్రమోషన్ లేదు. కారణం తనకు చదువు లేకపోవటం. అప్పట్నించి ఇప్పటిదాకా తను గూడ్సుబండి డ్రైవరుగానే వుండిపోయాడు.

ఏడికేమీ ప్రమోషన్ లేదు. ఒకేఒక్క ప్రమోషన్, దేవుడ్ని చూస్తున్నాడు కోటిగాడు.

తను డ్రైవరు అయింతరవాత కొంత విశ్రాంతి దొరకటం మొదలుపెట్టింది. తను ఇంటిదగ్గర వుండే అవకాశం ఎక్కువ చిక్కింది. అదే తనకు మేలుచేసింది. జీవితం బాగుపడేట్టు చేసింది.

కోటిగాడూ కూడా అమధ్య ఇంటిదగ్గర ఎక్కువకాలం వుండటం మొదలు పెట్టాడు. తనకప్పుడే భయం కలిగింది. వాడి మన్న అవిశ్రాంతే తనకు కష్టం కలిగించింది. వాడికొంత ముంచింది. తనకు కోపం తెప్పించింది. పిల్లి తనచేతులతో చంపించింది.

—వెధవ స్వర్గంలో రంభతో తతంగాలా తైతక్కలూ ఆడుతాడులే. ముక్క. ఛీ! ఇంజన్లోంచి ఉమ్మేశాడు.

మేస్త్రీకి రోజువిడిచి రోజు రాత్రి డ్యూటీవుండేది. మేస్త్రీ భార్య పదిగంటలకే కునుకు తీస్తుంది. తనకు రాత్రి రెండుగంటల దాకాని ప్రపట్టేదికాదు. ఇంటిదగ్గరున్న రోజుల్లో మేస్త్రీ 'ఏంబాబూ ఇంకా నిద్దరపోలేదూ' అని అడిగేవాడు. తను ఏ సమాధానమూ చెప్పేవాడుకాదు. 'పిచ్చిబాబు ఏమాలోచిస్తున్నాడో' అనుకుంటూ వెళిపోయేవాడు పిచ్చిమేస్త్రీ.

తనకు విశ్రాంతి ఎక్కువైనా రాత్రిడ్యూటీ కూడా వుండేది. కొడుక్కి కూడా ఎక్కువగా నైట్ డ్యూటీలు వస్తుండేవి. తనభార్య పదిగంటలలో పడుకుంటుంది. వాడు ఎప్పుడు ఎక్కడ పడుకునేవాడో ఎవరికీ తెలియదు! ఏరా ఎక్కడున్నావంటే ఏమీ చెప్పేవాడు కాదు.

—వెధవ, తనకు తెలియకుండా చేయగలడా! అశుభ వింటరా అప్రాచ్యపు ఫూల్. కొండ్రించి మండే పొయ్యిలో ఉమ్మివేశాడు డ్రైవరు.

మేస్త్రీకి ఒక కూతురుంది. అప్పుడు దానికి పద్దెనిమిది సంవత్సరాలు. లోకో షెడ్డు చుట్టూ చిన్న చిన్న బొగ్గులేరి కాఫీహోటళ్ళలో అమ్ముతూవుండేది. పెట్రోలు, కిరోసిను దిగుమతైనప్పుడు పనికిరాని ప్రతిబొట్టు గుడ్డతో అద్ది, ఆగుడ్డ డబ్బాలో పిండుకొని దాన్ని అమ్మి డబ్బు సంపాయించేది. వాగన్లలోంచి కట్టెలు దిగినప్పుడు దొంగిలించి అమ్మి, డబ్బు కూడబెట్టేది. మేస్త్రీముఖం చూచి, ఆపిల్లను చూచీ చూడనట్లు పోనిచ్చేవాడు కాపలాదారు. ఆ పిల్ల వస్తుంటే షెడ్డు కాపలా జవాను నోరు చప్పరిస్తూ డ్యూటీ మరచిపోయేవాడు.

తనకూ ఒక కూతు రేడిసింది. దానికిప్పుడు పద్దెనిమిది నిండాయి. అది విలువలేనిపిల్ల. తను దానికి గౌరవం తెద్దామని గొప్పవాడికిచ్చి పెళ్ళిచేద్దామనీ కలలుకన్నాడు. తను దాన్ని

PHONE: 2002. POST BOX: 1625.
RESI.: 61725. GRAMS: 'NATHELLA'.
NATHELLA SAMPATHU CHETTY & SON
నాదెళ్ళ సంపత్తు శెట్టి & సన్
DIAMONDS & GUARANTEED JEWELLERS
No. 177.
N.S.C. BOSE ROAD, MADRAS. I.
శ్రీమకమలములు నాణ్యమైన నగల వర్తకులు
మదరాసు. 1.

ఎక్కడకూ ఎవ్వడూ పోనివ్వకుండా, అన్నీ ఇంట్లో అమర్చేట్టు చేశాడు. చివరకు అర్థంలేనిపని చేసింది. వెధవ కోటిగాడు దాన్ని చూస్తే ఏపనీ చేసేవాడుగాదు.

మేస్త్రీ కూతురు, మేస్త్రీ నైట్‌డ్యూటీకి పోయినప్పుడు ఒంటిగంటా రెండుగంటలుదాకా నిద్రపోయేదికాదు. తెల్లవారు ఝాము నాలిగింటికే లేచి, ఆపనీ, ఈపనీ చేసేది.

తనకూతురు, బాబూ తినూ, నైట్‌డ్యూటీకి పోయి పగలు నిద్రపోతుంటే అదికూడా ప్రక్కనే చేరి ఒళ్ళుమరచి నిద్రపోయేది.

కూతురు నలతగా వుంటోందని విచారించిన మేస్త్రీ, దాన్ని ఎక్కువగా పనిచేయనివ్వటంలేదు. కూతురు చురుగ్గా పనిచేయటం లేదు. కాని, తీర్చిదిద్దిన గుమ్మటంలాగా, బొద్దుగా, శుభ్రంగా కొంచెం చియ్యబట్టి నున్నగా, నిగనిగలాడుతూ అందంగా తయారవుతోంది. ఆతరవాత రోజుల్లోకు తెలిసింది మేస్త్రీకి, కూతురికి నెలలు నిండుతున్నాయని.

రెండురోజుల క్రిందట తనకు తెలిసింది, తనకూతురికీ నెలలు నిండుతున్నాయని.

అప్పుడు మేస్త్రీ గుండె పగిలిపోయింది.

మొన్న తనగుండె మంటే ఇంజను పొయ్యిలాగా అయిపోయింది.

మేస్త్రీ అసమర్థుడు. బలహీనుడు. పిరికివాడు.

తను ధైర్యం కలిగినవాడు. శక్తిమంతుడు, సామర్థ్యం వున్నవాడు.

ఆరోజు తను మేస్త్రీఇంటికి పోయేసరికి, మేస్త్రీ భార్య హృదయంలో బొగ్గులకుంపటి రాజుకున్నట్లు కూర్చుంది. మేస్త్రీ కూతురు వెక్కి వెక్కి మంటూ వాకిట్లో ఓ ప్రక్కగా నక్కింది.

మేస్త్రీ చిలపరపేడు తీసుకొని, అప్పుడే అలసిపోయి వచ్చిన తనని దుగ్గుదుగ్గుగా బొగ్గుని చితగ్గొట్టినట్లు చితగొట్టాడు. తను కిక్కురు మనలేదు. 'నాయింటోనించి పో భడవా' అన్నాడు మేస్త్రీ. ఆరోజు తను తడబడుతున్న కాళ్ళతో వెనుదిరిగి చూచుకుంటూ వెళ్లిపోయాడు.

ఆ రోజు రాత్రి తను డ్యూటీకి పోలేదు. లోకోషెడ్డు చుట్టూ అదేపనిగా తిరిగాడు. షెడ్డు ప్రక్కగా బొగ్గుగుట్ట దగ్గరగా మురికి కుంటలో కాళ్ళుపెట్టి బొగ్గుని చేత్తో గిల్లుతూ, మురికికుంటలోనే ఈదులాడే కప్పను చూస్తూ తను కూర్చున్నాడు.

ఆ రోజే మేస్త్రీ వెనకగా వచ్చి, లేపి తీసుకుపోయి తనని ఇంట్లోపెట్టి ఎక్కడికో వెళ్లిపోయి తెల్లవారిం తరవాత వచ్చాడు. మేస్త్రీ భార్య ఆ రోజు రాత్రి బైట పడుకుంది. ఆకాశంలో చంద్రుడున్నాడు. భూమ్మీద వెన్నెల వుంది. తనకు ఒంటినిండా దెబ్బలున్నాయి. హృదయం నిండా వెన్నెలుంది.

మేస్త్రీ శక్తిహీనుడు!

తను శక్తిగలవాడు.

తనకు ఏమీ తెలియనీయకుండ ఇంత పనిచేసిన కోటిగాడ్ని తను క్షమించదలచుకోలేదు. చంపివేయాలి. అందుకే బాబుతో ఆలోచించి, నిర్ణయించుకొని, పీడ్ని గూడ్సుబండి ఇంజను పొయ్యిలో కూడ్చివేశా ననుకున్నాడు డ్రైవరు గురవయ్య.

ఇంజను టాపుమీద ఎవరో కదులుతున్నట్లు శబ్దం నిశ్శబ్దంలో స్పష్టంగా వినవచ్చింది. ఇదేదీ డ్రైవరుకు వినిపించదు. ఫైర్‌మన్ ఇదేమీ పట్టించుకోలేదు.

ఇంజను మూడుసార్లు కూతవేసి, ఒక చిన్నస్టేషను ప్లాటు ఫారం దాటి వెళిపోయింది.

ఇంజను పొయ్యిలోంచి వాసన వస్తున్న జాడలేమీ లేవు, పూర్తిగా వాసన ఆగిపోయింది. ఏ పరమాణువు దొరక్కుండా ఇరవై సంవత్సరాలు పెరిగిన శరీరం ఒక్కగంటలో కాలిపోయింది.

దూరంగావున్న నదిమీద బ్రిడ్జీ మినుకు మినుకుమనే దీపాలతో నే నిక్కడున్నాను సుమా అని హెచ్చరిక చేస్తోంది.

నది కాళ్ళు చేతులూ ఆరజాపుకొని గాలికి కదులుతున్న చీరను సరిచేసుకోకుండా నీటుగా నిద్రపోతోంది కాబోలు.

ఇంజను టాపుమీద మనిషి జాగ్రత్తగా నడుస్తున్నట్లు శబ్దం వినవస్తోంది. ఫైర్‌మన్ ఏమిటో అనుకున్నాడు. ఇంజను నడుపుతున్నాడు.

చీకటి చీల్చుకుంటూ గూడ్సుబండి నడుస్తోంది.

గురవయ్య మామూలుస్థితికి వచ్చేప్రయత్నంలో వున్నాడు.

ఫైర్‌మన్ గూడ్సుబండి డ్రైవ్ చేస్తున్నాడు. డ్రైవర్ ఇంజను పొయ్యిలో బొగ్గువేస్తున్నాడు. ఆ పని అసలు చేయవలసింది ఫైర్‌మన్.

క్రిందవున్న బొగ్గుతీసి రెండుసార్లు పొయ్యిలో వేశాడు. మూడోసారి తీయబోతూ ఆగిపోయాడు. తీక్షణంగా బొగ్గు చిదుగుల వైపు చూస్తూ వుండిపోయాడు.

అలా ఎంతోసేపు చూడకుండ గురవయ్య వంగి ఏదో పైకితీసి, ఊది, పైనున్న చొక్కాతో తుడిచి జాగ్రత్తగా చూశాడు.

పులిగోరు!

ఆ పులిగోరు తను బాబుకి రెండు సంవత్సరాలునాడు చేయించాడు. అది ఇక్కడెందుకు పడింది? బాబు ఇంజనులోకి రాలేదు. క్రింద వుండి అందించాడు. బాబు మెడలోవుంటే పులిగోరు ఎలా ఇంజనులోకి వచ్చింది?

హత్య జరిగేటప్పుడు అనుకోకుండా బాబు మెడలోని పులిగోరు కోటిగాడి చేతిలోకి వచ్చివుంటుంది.

ఇంజను టాపుమీద అలికిడి గురవయ్య విన్నాడు.

నిరామయంగా క్రిందకు వంగి బొగ్గు తీస్తున్నాడు.

ఇంజను టాపుమీంచి ఎవరో గుభిల్లున దూకారు.

డ్రైవరు తల ఎత్తేసరికి ఇంజను డ్రైవ్ చేస్తున్న ఫైర్‌మన్ గుండెల్లో కత్తి గ్రుచ్చుకుపోయింది.

కత్తిపిడిని పట్టుకున్న పిడికిలి, కత్తిని గుండెల్లోంచి బైటికి లాగింది.

గురవయ్య కత్తిని చూశాడు. పిడిని చూశాడు. పిడికిలిని చూశాడు. వచ్చిన వ్యక్తి ముఖాన్ని చూశాడు.

ఆశ్చర్యపోయాడు. భయపడ్డాడు. నీరుగారిపోయాడు. వాడు తనమీద కొస్తున్నాడు. వాడు కోటిగాడు.

ఒడ్డుల్ని ఢీకొంటూ మదించి ఘోషతో ప్రవహిస్తున్న నది పైన బ్రిడ్జీమీదికి గూడ్సుబండి ఎక్కింది.